# రుచిమరిగిన పులి

వీధి అరుగు మీద బలరామయ్యగారు అవిరామంగా పచార్లు చేస్తున్నారు. మధ్య మధ్య అరుగు మెట్ల మీదకు వచ్చి వీధి చివరి వరకూ చూస్తున్నారు. చూసి నిరాశపడుతున్నారు. మళ్ళీ అంతలోనే ఆశగా ఆత్రంగా చూస్తున్నారు.

నిజానికి ఆయనకెంతో గాభరాగానూ ఆత్రుతగానూ ఆందోళనగానూ వుంది. ఎక్కడ తను అనుకున్నట్టు జరక్కుండా పోతుందోనని ఒకటే ఇదై పోతున్నారాయన.

"ఇకనైనా భోజనానికి లేచేది వుందా లేదా" పదోసారి అడిగిందాయన భార్య గుమ్మంలో కొచ్చి.

"మధ్యలో నీగోలేవిటే. వెళ్ళవతలికి. ఇప్పుడు భోజనం చెయ్యకపోతే కొంపలంటుకుపోతాయి కాబోలు పొద్దుట్నుంచీ ఒకటే నస!' విసుక్కున్నారాయన.

"ఇదేం చోద్యంరా దేవుడా. పురుమురిమి మంగలం మీద పడ్డట్టుంది వరస !" సణుక్కుంటూ వెళ్ళిపోయిందావిడ.

అదేమీ పట్టించుకునే స్థితిలో లేరు బలరామయ్యగారు. ఆయన దృష్టంతా రోడ్డు మీదా, రావాల్సిన సుబ్బన్నగారి మీదా వుంది.

హఠాత్తుగా ఆయన కళ్ళు మెరిశాయి. తనువు పుప్పొంగింది.

అల్లంత దూరాన సుబ్బన్నగారు వస్తూ కన్పించారు. ఆయన శరీరంలోని అణువణువూ ఏదో తెలీని ఆనందంతో పులకించి పరవశించి పోతోంటే ఎన్నడూ లేని కంగారు ఆవహించడంతో గబగబా కుర్చీలో కూలబడి పొగాకు పారం తీసి చుట్ట చుట్టుకోసాగారు. తను సుబ్బన్నగారి కోసం ఎదురుచూట్టంలేదన్న భ్రమ కల్పించాలని ఆయన తాపత్రయం!

కొన్ని నిమిషాలు గడిచాయి. ఆయన మాత్రం రాలేదు.

బలరామయ్యగారికి ఆందోళన అధిక మయ్యింది. "ఈ పాటికి రావాల్సిందేనే" అనుకుంటూ మెట్లవరకూ వచ్చి వీథివైపు చూశారు.

సుబ్బన్నగారు ప్రక్క సందులోకి మళ్లటం కంటబడే సరికాయన గుండెలు జారిపోయాయ్. ఒక్కసారే డీలా పడిపోయారు. కానంతలోనే అంతవరకూ అక్కడ తచ్చాడుతోన్న సుబ్బన్నగారు తమ ఇంటివేపు తిరగటంతో పరమానందం కలిగింది. ఆనందాన్ని ముఖంలో కన్పించ నీయకుండా జాగ్రత్తపడి ఏమీ ఎరగనట్టు కుర్చీలో కూర్చున్నారు.

సుబ్బన్నగారు తనింటి ముందుకి వచ్చేశారు. పలకరించకపోతే ఎక్కడాయన ఇల్లుదాటి వెళ్లి పోతాడోనని "ఏం సుబ్బన్నమావా. ఏవిటీ మధ్య బొత్తిగా నల్లపూసై పోయావ్" అన్నారు బలరామయ్యగారు.

"ఆఁ ఏముందిలే. మామూలు జంఝాటమే" నాన్చేశారాయన.

"అరె-అక్కడే నిలబడి పోయావేం మావా. పైకిరా. చుట్ట కాలుస్తా వేమిటి. లంక పుగాకులే. నాగుల్లంక నుంచి మా బావమరిది పంపించాడు. ఇదిగో ఏమేవ్ మీ బాబాయి చుట్ట కాల్చుకుంటారు కాస్త నిప్పు తెచ్చి పెట్టు" అని కేకపెట్టారు సుబ్బన్నగారికో చుట్ట అందిచ్చి.

బలరామయ్యగారి భార్య నిప్పు తెచ్చి గుమ్మం ఇవతల వుంచింది, దాంతో ఇద్దరూ చుట్టలు వెలిగించుకున్నారు.

"ఈ మధ్యనసలు బొత్తిగా కన్పించడం మానేశావేం సుబ్బన్న మావా"

"పనుల్రోజులు కదా...."

"అన్నట్టు మనబ్బాయికేదో ఇంటర్వ్యూ వచ్చిందటగా"

"అవునల్లుడూ. అబ్బాయిని హైదరాబాద్ పంపాలి"

"మరింకా చూస్తావేం ? ఇంటర్వ్యూకి పిలుపొస్తే మూడొంతులు ఉద్యోగం వచ్చేసినట్టే. పైగా గవర్నమెంటుద్యోగం. గవర్నమెంటు సొమ్ము తినే యోగం అందరికీ పడుతుందా చెప్పు ? ఏదో అదృష్టం కొద్దీ మనబ్బాయి కొచ్చిందంతే. రెండేళ్ల నుంచి దానికి దీనికి అంటూ చెప్పులరిగేలా తిరుగుతోంటే ఇన్నాళ్లకి దేవుడు కరుణించాడు. మరి నువ్వింకా ఇలా నానుస్తూ కూర్చుంటే ఎలా మావా. నా మాటివి వెంటనే నువ్వు అబ్బాయిని తీసుకుని హైదరాబాదెళ్ళిపో పనై పోద్ది"

"అంతా ఆ మాటే అంటున్నారనుకో కానీ చేతిలో తడి వుండాలిగా...."

"దాన్దే వుంది మావా. ఎవడు బడితే వాడే ఇస్తాడు నీకు. ఎవడో ఎందుకు నువ్వు వూఁ అంటే నేనే ఇస్తాను ఎంత కావాలో చెప్పు. నన్నడిగితే ఇలాంటప్పుడు డబ్బుకోసం వెనకా ముందాడకూడదు. అవకాశం అన్నప్పుడల్లా వస్తుందా చెప్పు ? నా మాటవిని ఏ రెండువేలో పట్టుకుని గోదావరి బండెక్కెయ్యండి. మన యమ్మెల్యేగార్ని కల్సుకుంటే మన పని చూడకపోరు. ఎంతైనా కులపోళ్లం గదా! ఇంకా ఏవైనా సాయం కావాలంటే మా పెత్తోడల్లుడి మూడో కొడుకు అదేంటీ—సెక్రటేరియట్లో కాబోలు—పన్జేస్తున్నాడు. మంత్రులంతా రోజూ. అక్కడి కొస్తూంటారంట వాడ్ని కల్సుకుంటే సరి పని ఇట్టే అయిపోతాది. అబ్బాయికుద్యోగం వచ్చేస్తే నువ్వు గట్టెక్కేసినట్లేగా-ఏం సుబ్బన్నమావా ?!"

"అవుననుకో. కానీ...."

"నీ అనుమానాలు నంతకెల్ల! ఇంకలాటివేం పెట్టుకో మాకు. మొన్నీ మధ్య మా బామ్మర్ది వాళ్లబ్బాయి వుద్యోగం కోసం ఇలాగే హైదరాబాదెళ్లి ఓ తెల్లాఖ్నండి సాధించుకొచ్చాడు. ధైర్యం చేసి అక్కడి కెళ్లాలి గానీ పని ఇట్టే అయిపోద్దంటే నమ్మ. పైగా మనోడికన్నీ ఫస్టు మార్కులే గందా!" ఎలాటోళ్ళైనా కళ్ల కద్దుకుని వుద్యోగం ఇచ్చేస్తారు !"

"అయితే యెళ్తేనే రైటంటావా ?"

"నన్నడిగితే ఇవాళే ఇప్పుడే వెళ్లమంటాను. మనకన్నా ముందు ఇంకొకళ్ళెళ్ళి తన్నుకుపోక ముందే మనం వెళ్ళి చేజిక్కించుకోవాలి. లేకపోతే మరోడు తన్నుకు పోడూ ?"

సుబ్బన్నగారు ఆలోచనలో పడ్డారు.

ఆయన ఆలోచన బలరామయ్యగారికి ప్రాణ సంకటంగా వుంది.

"నోటు మీదో అయిదొందలుంటే ఇవ్వ అల్లుడూ. పంట చేతికి రాగానే తీర్చేస్తానూ"

"ఆ మాత్రం దానికి నువ్వు నోరు తెరచి అడగాలా మావా కాకితో కబురంపితే పట్టుకొచ్చి ఇవ్వనూ? అద్సరే-అయిదొందలు ఏ మూలకి చెప్పు ? చార్జీలకి చాలవు. ఇంకక్కడ ఆఫీసర్లకి గట్రా ఋణమోపణమో ముట్టజెప్పాలంటే అక్కడెవరిస్తారు చెప్పు ? అంచేత నా మాటిని రెండు వేలు పట్టుకెళ్లు."

"అంతెందుకులేవయ్యా"

"అమ్మమ్మా అలా అనకు. వెధవ డబ్బు గురించి కాదు. తెల్లారి లేస్తే వేలు గడిస్తాం. కానీ వుద్యోగాలు ఎప్పుడు బడితే అప్పుడొస్తానూ చెప్పు ? వచ్చినప్పుడే తెలివిగా వుపయోగించుకోవాలి. ఆపైననలు అప్పుని

అబ్బాయే తీర్చేస్తాడు నెలనెలా కొంత పంపి. అసలప్పటిదాకా ఎందుకు-పోలుడు కట్నంతో పిల్లనిస్తామని మీ ఇంటి చూట్టూ తిరగరూ. ఆ కట్నం డబ్బుతో చులాగ్గా తీర్చేయ్యొచ్చు. ఏవంటావ్ ? ఒకవేళ మిగిల్తే తిరిగి ఇచ్చేద్దువుగాన్లే జమ కట్టేసుకుంటా" అన్నారు.

ఆయన మౌనం వహించడంతో దాన్ని అంగీకారంగా తీసుకుని లోపలికెళ్ళి ప్రోనోటూ తెల్ల కాగితమూ కలమూ పట్టుకొచ్చి "రెండువేలకి రాసేస్తున్నాను" అన్నారు

సుబ్బన్నగారు అనుమానంగానే తలూపడం ఆలస్యం గబగబా రాసేసి సంతకాలు కూడా పెట్టించేసుకున్నారు.

ఇంతలో అటుగా కోదండం రావడంతో "కాస్త సాక్షి సంతకం పారెయ్‌వోయ్" అంటూ అతడి సంతకం కూడా తీసుకుని డబ్బు తెచ్చిచ్చి "లెక్క పెట్టుకో మావా" అన్నారు బలరామయ్యగారు.

"ఎందుకులే" అంటూ డబ్బు తీసుకుని వెళ్ళిపోయారు సుబ్బన్న గారు.

అప్పుడాయన కళ్ళల్లో కదిలిన కన్నీటి చార లెవరికీ కన్పించ లేదు!

బలరామయ్యగారికి పరమ సంతోషంగా వుంది. ఎలాగైతేనేం తన 'గుహ'లో కొచ్చాడు. అదే పదివేలు!

"మొత్తానికి పడగొట్టేశారు" కోదండం అన్నాడు.

"నాదే వుంది గానీ ఆయన అవసరం అలాటిది మరి"

"నాకు తెలీని కొత్త సంగతులా ఏవిటి గాని ఓ పాతిక నా మొఖాన కొట్టండి"

"పాతికా ?"

"లేకపోతే ముష్టి వేసినట్లు మూ(డూపాయలిస్తారా ?"

"అహ—అది కాదు కోదండం...."

"మీరీసారి పాతికిచ్చి తీరాల్సిందే. సుబ్బన్నగారు మునసబుగారింటి వేపెళ్తొంటే ఆయన దొంగ వడ్డీలు కడతాడనీ అదనీ ఇదనీ చెప్పి మీ గడప ఎక్కేలా చేశాను"

రెండు క్షణాల పాటు ఆలోచించారాయన. కోదండంతో గొడవ పట్టం మంచిది కాదన్పించింది. అతడితో అనలైన పనంతా ముందే వుంది కూడానూ!

వెంటనే అన్నారు "ఇరవై ఇస్తాను. ఇంక ఈసారికి మాట్లాడకు" అన్చెప్పి లోపల్నుంచి దుఃఖం తన్నుకొస్తోంటే రెండు పదులు అందిచ్చారు వూరికే దానం చేస్తున్నట్టుగా వుందాయనకి మరి!

* * *

సుబ్బన్నగారు పొలం వెళ్ళి వస్తోంటే బలరామయ్యగారు ఎదురు పడి పలకరించారు.

ఆయనెక్కడ బాకీ సంగతి ఎత్తుతాడోనని గాభరాపడ్డారు సుబ్బన్నగారు.

"ఏం సుబ్బన్న మావా-విశేషాలేంటీ"

"ఏం వున్నాయ్ అల్లుడూ. దాన్వా వుంటే మిగిల్నా మిగలక పోయినా చేతి నిండా పనైనా వుండేది"

"అవునవును. అన్నట్టు మనబ్బాయికి మళ్ళి ఇంటర్వ్యూలేం రాలేదు కదూ ?"

"రాలేదయ్యా. అప్పట్లో ఆ ఆఫీసరు మోసం చేశాడు గానీ లేక పోతే...."

"అంతే మావా. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మడానికి లేదనుకో. అన్నట్టు బాకీ సంగతి మర్చిపోయినట్టున్నావ్ సుబ్బన్నమావా"

"అబ్బె బ్బే-మర్చిపోలేదయ్యా. కాస్త కాలూ చెయ్యీ కూడదీసుకోగానే...."

"అమ్మమ్మ వూరికే అడిగేస్తప్ప తొందరేం లేదు. నీ బాకీ ఎక్కడికి పోద్ది చెప్పు. అది సరే గాని సుబ్బన్న మావా నువ్వేమీ అనుకోనంటే ఓ మాట చెప్పాలనుంది"

"దేని సంగతి ?"

"మన బాకీ సంగతే. ఇప్పటికే నువ్వు తీసుకున్న అప్పు అయిదు వేల అయిదొందల దాకా వుంది. ఇక వడ్డీయేమో మూడున్నర రూపాయలాయె. మనం నిద్రపోయినా అప్పు నిద్రపోదు కదా ? రాత్రీ పగలూ పెరుగుతూనే వుంటుందాయె. తాత్సారం చేస్తే తడిసి మోపుడవక మానదు కదా. అంచేత అయితే అయ్యిందని ఒక ఎకరం పొలం అమ్మేస్తే అవతల అప్పూ తీరుతుంది. ఇవతల మనశ్శాంతీ దక్కుతుంది. ఈ రోజుల్లో పొలం మీదెంత మిగుల్తోందే మనం చూస్తూనే వున్నాం కదా. ఆ వడ్డీల్తో అవస్థపడే కన్నా ఇలా చేస్తే బావుంటుందని నా సలహా. ఆ తర్వాత నీ ఇష్టం. వస్తాను మావా."

బలరామయ్యగా రెళ్ళిపోయారు ఆలోచనల అగ్గిపుల్ల వెలిగించి.

సుబ్బన్నగారు తీవ్రంగా ఆలోచించారు. భార్యా బిడ్డల కూడా చెప్పేరు. పొలం అమ్మడం మంచి పని కాదన్నారు ఇంట్లోని వారంతా.

కాని ఎకరం మీద వచ్చే పంటనీ అప్పుకయ్యే వడ్డీనీ బేరీజు వేసి చూస్తే అమ్మెయ్యడమే మంచి దన్పించింది. పైగా అప్పు కేన్సర్‌లాంటిది. కేన్సర్ సోకిన భాగాన్ని తొలగించకపోతే అది మిగిలిన భాగాల్ని కూడా తినేస్తుంది! పైగా దరిదాపుల్లో అప్పు తీర్చగల పరిస్థితేమీ కన్పించడంలేదు కూడానూ!

ఆఖరికి ఒక ఎకరం పొలం అమ్మి ఋణ విముక్తుడు కావడానికే నిర్ణయించుకున్నారు సుబ్బన్నగారు. ఆ నిర్ణయం బాధకలిగిస్తోన్నా మరో దారి కన్పించడం లేదాయనకి.

దానికి తోడింకో ఆశ కూడా పీకుతోంది.

కాలేజీ చదువు చదివిన కొడుకు వుద్యోగం సద్యోగం లేక ఇంట్లోనే వున్నాడు. ఇదివరకు ఇంటర్వ్యూ వచ్చినప్పుడు హైదరాబాదెళ్ళి మోసపోయినా అక్కడ కొన్నాళ్ల పాటుండివుంటే ఈ పాటికి వుద్యోగం వచ్చేదని అంతా అంటున్నారు. కొడుకూ అంటున్నాడు. ఓ వెయ్యి రూపాయలిచ్చి పంపిస్తే వెంటనే గాకపోయినా ఒకటి రెండు నెలల్లో ఏవో వుద్యోగం రాకపోదని ఆశగా వుంది.

అలా నిర్ణయాని కొచ్చేక తన అభిప్రాయాన్ని సూచాయగా వొకా యిన్తో అన్నారు సుబ్బన్నగారు. దాన్తో సుబ్బన్నగారు ఎకరం పొలం బేరం పెట్టేశారని వూరంతా గుప్పుమంది

వార్త అందరి కన్నా ముందు బలరామయ్యగారికి తెలిసింది. అందు కోసమే గోతికాడి నక్కలా కాచుక్కూర్చున్న ఆయన ఎగిరి గంతేశారు. వెంటనే కోదండానికి కబురంపి పిలిపించుకున్నారు.

"రావోయ్ కోదండం. ఇంద ఈ యాభై వుంచు" డబ్బు ఇస్తూ అన్నారు.

"మీరింత వుదారంగా ఇస్తున్నారూ అంటే ఏదో పెద్ద యవ్వారమే వుండి వుంటుంది.

"వూళ్ళో ఎవరి కాళ్లో ముల్లుదిగినా ముందు నా కన్నే కదా చెమర్చేదీ !"

"కాదు మరీ. వూరోళ్ల కోసమే కదా మీరు వడ్డీ వ్యాపారం చేస్తోంది!

"బాగా చెప్పేవ్. సంగతేవిటంటే సుబ్బన్నమావ పొలం బేరం పెట్టాడు."

"పెట్టక ఛస్తాడా ఇరుక్కుపోయాక! ఇక రంగంలోకి దిగి పొమ్మం టారా ?"

"అందుకే కదా నిన్ను పిలిచింది."

"ఈ నోటు చాలదండి"

"తర్వాత చూసుకుందాంలేవోయ్ ముందు పని కానియ్"

"పెద్ద నోట్లు రెండైనా కొట్టాలి ముందే చెబుతున్నా"

"నీ అమ్మ కడుపు మాడ— తర్వాత చూసుకుందాంలే"

కండువా భుజాన వేసుకుని తిన్నగా సుబ్బన్నగారింటి కెళ్ళాడు కోదండం.

"సుబ్బన్న బాబాయ్! ఎకరం పొలం బేరం పెట్టేవంటేంటీ"

"అవున్రా అవమానంగా ఫీలవుతూ బదులిచ్చారు.

"మన ప్రక్కూరి నాంచారయ్య గారడగమన్నార్లే. అయిదువేల కామధ్యెవరో ఎకరం అమ్మేర్ట. ఆ లెక్కనిస్తానంటున్నారు...."

అదిరి పడ్డారాయన.

"పన్నెండు వేలు చేసే బంగారంలాంటి పొలం అయిదువేల కడి గారా ?"

"నువ్వెక్కడో పూర్వకాలపు రేటు చెబుతున్నావ్ బాబాయ్. ఈ మధ్యనలు పొలాలు అమ్మేవాళ్ళేగాని కొనేవాళ్ల కన్పించడం లేదు తెలుసా. లాండ్ సీలింగు తెచ్చిన తంటా ఇది. డబ్బున్న వాళ్ళంతా పట్నాలకీ పరిశ్రమలకీ ఎగ బడుతున్నారు ఈ గొడవలు పళ్ళేక. అయిదువేలంటే అయిదువేలే కాదనుకో ఓ రెండు మూడొందలు అటూఇటూలో వూ అనేట్టయితే ముందు నాకు చెప్పు బాబాయ్" అనేసి వెళ్ళిపోయాడు కోదండం.

ఎంత పొలం అమ్మకానికి పెడితే మాత్రం మరీ ఇంత దారుణమా? అని విలవిల్లాడారు సుబ్బన్నగారు.

కాని ఆ మర్నాడు మరొకత నొచ్చి నాలుగువేలకి అడిగేసరికి నోట మాట రాక ప్రాన్పడిపోయారు.

తేరుకున్నాక "పదివేలకి పైసా తక్కువైతే అమ్మనుగాక అమ్మను" అన్నారు బింకంగా.

మరో వారం పదిరోజుల్లో ముగ్గురు మధ్య వర్తు లొచ్చారు. చిత్ర మేమిటంటే అంతా అయిదువేలకి అంతకి తక్కువకీ అడిగారు గాని ఒక్కళ్లూ అయిదువేలని మించి ఒక్క రూపాయీ పెట్టలేదు !

సుబ్బన్నగారికి నిజంగానే మతిపోయినట్లుగా వుంది వస్తోన్న బేరాల్ని చూస్తోంటే.

ఎంతో ఖరీదైన పొలాన్ని కంత తీస్తే చాలు కాలువలోని నీళ్లొచ్చి పడే పొలాన్ని అయినకాడికి అడగటం మహాదారుణ మన్పించింది. పొలం అమ్మడం మానేస్తే బావుణ్ణనీ అన్పించింది.

కాని అదే సమయంలో భూ సంస్కరణల గొడవల వల్లా వరుసగా పంటలు దెబ్బతింటూండటం వల్లా పొలాలమ్మే సన్నకారు రైతు లెక్కువా కొనే వాళ్ళు తక్కువా అవడం వల్లా ఇంకొన్నాళ్లు పోతే ఆ రేటుకైనా కొనేవా ళ్లుండరేమో నన్న భయం పట్టుకుంది.

ఏం చేయాలో పాలుపోక సతమతమవుతోంటే బలరామయ్యగారు కబురంపారోసారి రమ్మని. బాకీ సంగతి అడగటానికా బోలా దేవుడా అని ఇదవుతూ వెళ్ళారు సుబ్బన్నగారు.

కానాయాన సుబ్బన్నగార్ని ఎంతో ఇదిగా ఆహ్వానించి మర్యాద లూ శా చేసేసరికి సుబ్బన్నగారికి మతిపోయినంత పనయ్యింది.

కులాసా కబుర్లయ్యాక బలరామయ్యగారన్నారు "అద్సరే గాని సుబ్బన్న మావా— నువ్వేదో పొలం బేరం పెట్టావంట. నిన్నెవరో అంటే తెలిసింది...."

"అవునల్లుడూ. బాగా ఆలోచిస్తే నువ్వన్నదే సబబు అన్పించింగి. కాస్త పొలం అమ్మి గుండెల మీది కుంపటిలాంటి అప్పును దించుకోవ డమే మేలన్పించింది. అందుకని ఓ ఎకరం బేరం పెట్టాను...."

"ఏమైనా కుదిరిందేవిటి ?"

"ఇంకాలేదు. ఏవో బేరాలొస్తున్నాయి...."

"నేను అప్పిచ్చి ఆడుకున్నానని అడగటం కాదుగాని అదుపేలు

చేసిస్తే నేను కొంటాను మావా. ఎలాగూ నాకు బాకీ వున్నావు గనుక అదీ ఇదీ సరిపోతుందని అడుగుతున్నా నప్ప నాకింకో వుద్దేశ్యం లేదంటే నమ్ము"

సుబ్బన్నగారికి కొంచెంగా సంతోషం కలిగింది. ఇంతవరకూ వచ్చిన బేరాల్లో ఇదే పెద్దది మరి! అలాగని అయిన కాడికి అమ్మెయ్య డానికి బొత్తిగా మనసొప్పలేదు !

"ఈ మధ్య ఆ ప్రక్క పొలం పన్నెండు వేలు చేసి కొన్న సంగతి నీకు తెలుసుగా అల్లుడూ" అన్నారు సుబ్బన్నగారు.

"అప్పట్లో అంత రేటొచ్చిన మాట నిజమే గాని ఈ సీలింగు లొచ్చేక మాలాటి వాళ్ళం భూమి కొనడానికే జడుస్తున్నాం. ఎప్పుడు ప్రభుత్వం వారు భూముల్లాగేసుకుంటారోనని హడలి పోతున్నామనుకో. అస లందేతే ప్రతీచోటా రేట్లు పడిపోయాయ్. అయినా కొనేవాళ్ళు దొర కడమే లేదు. దొరికిన వాళ్ళ దోచుకుందావనే చూస్తున్నారు. ఆ సంగతి నీకూ తెలుసు కదా సుబ్బన్నమావా"

"ఇంకో వెయ్యి రూపాయలు కట్టుకుని నీ మాట ప్రకారమే కాని అల్లుడూ"

"అమ్మమ్మా అలా అనకు. అక్కడికే ఎక్కువ పెట్టాను. పోనీలే పెద్దోడివి అడిగావు గనుక ఆ పైన అయిదొందలు కట్టుకో. నాకు బోల్డు స్టాంపుల ఖర్చవ్వుద్ది. ఈ మధ్య ఆ ఖర్చుని బాగా పెంచేశారు కదా" అన్నారు.

అనడమే కాదు వెంటనే ఒప్పందం కుదిరిపోయింది కూడానూ.

మొత్తానికి రేటు బాగానే కిట్టిందని సంతోషిస్తోన్న సుబ్బన్నగారు ఎకరం పొలం అమ్మినా ఇంకా బలరామయ్య గారికి రెండువేలు బాకీ వున్నారన్న సంగతి తెలిసేసరికి కుప్పకూలిపోయారు దిక్కుతోచక!

నాలికతో పెదాలు తడి చేసుకుంటూ మెత్తని పులిలా నవ్వు కున్నారు బలరామయ్యగారు.

—o—

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక. 5-12-'80)